# నమస్తే తెలంగాణ
# ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ గురువారం 17 అక్టోబర్ 2024 | ADILABAD NIRMAL




ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో ధర్నా చేస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలు

# స్కాలర్‌షిప్‌లు మహాప్రభో..

## డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థుల నిరసన

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రూ.232 కోట్లు పెండింగ్

మంచిర్యాల, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రైవేటు డిగ్రీ కాలేజీలు, విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్‌లు పెండింగ్ పడ్డాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే 78 ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు రూ.232 కోట్లు రావాల్సి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా గడిచిన మూడేళ్లలో ఏడు వేల కోట్ల రూపాయలు ఇలా పెండింగ్ పడ్డాయి. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు స్కాలర్‌షిప్‌లు విడుదల చేసింది. కాంగ్రెస్ సర్కారు మాత్రం ఈ విషయంలో విఫలమైందని ప్రైవేటు కాలేజీల యాజమానులు, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు మండిపడుతున్నారు. తెలంగాణ వచ్చిన పదేళ్లలో ఎప్పుడూ కూడా స్కాలర్‌షిప్‌ల కోసం రోడ్ల మీదకు వచ్చి ర్యాలీలు, ధర్నాలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ.. ఇప్పుడు కాలేజీలు నడిపే పరిస్థితి లేక రోడ్ల మీదకు వచ్చి నిరసన తెలపాల్సి వస్తుందని వాపోతున్నారు. తెలంగాణ ఉద్యమంలో రోడ్ల మీదకు వచ్చిన విద్యార్థులు ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు పుణ్యమా అంటూ మరోసారి రోడ్ల మీదకు వచ్చి స్కాలర్‌షిప్‌ల కోసం నిరసన తెలపాల్సిన దుస్థితి దాపురించిందంటున్నారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతోనే నిరసనలు, ఆందోళనలు చేపట్టాలని నిర్ణయానికి వచ్చినట్లు చెప్తున్నారు. అప్పులు చేసి, ఉన్న ఆస్తులు అమ్ముకుని ఉద్యోగులకు జీతాలు ఇచ్చామని, ఇప్పుడు అది కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్నామని చెప్తున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రైవేటు డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు, విద్యార్థి సంఘాలు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆసిఫాబాద్ జిల్లాలోనే ఈ తరహా ర్యాలీ తీశారు. ఆదిలాబాద్‌లో యాజమాన్యాలు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశాయి. నిర్మల్ జిల్లాలో ప్రైవేటు డిగ్రీ కాలేజీల ఎదుట నిరసన దీక్షలు చేశారు. మూడు, నాలుగు రోజులుగా వివిధ రకాలుగా డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు నిరసనలు తెలుపుతున్నా ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది.

**ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు రావాల్సిన స్కాలర్‌షిప్‌ల వివరాలు**

| జిల్లా | ప్రైవేటు డిగ్రీ కాలేజీలు | పెండింగ్ ఉన్న మొత్తం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 22 | రూ.102 కోట్లు |
| మంచిర్యాల | 25 | రూ.90 కోట్లు |
| నిర్మల్ | 23 | రూ.25 కోట్లు |
| ఆసిఫాబాద్ | 08 | రూ.15 కోట్లు |




కుంటాల మండలంలోని కల్లూరులోని ఓ డిగ్రీ కళాశాల ఎదుట బంద్ నిర్వహిస్తున్న యాజమాన్యాల సభ్యులు

## మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్మన్ భూమారెడ్డి

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 16 : నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని బుధవారం వ్యవసాయ శాఖ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఇందులో చైర్మన్‌గా సోమ భూమారెడ్డి, వైస్ చైర్మన్‌గా ఈటల శ్రీనివాస్‌తోపాటు డైరెక్టర్లతో వ్యవసాయ శాఖ అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం నూతన పాలక మండలిని పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, నాందేడపు చిన్ను, గణేశ్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్ సమీపంలోని జాతీయ రహదారి-44ని కమ్మేసిన పొగమంచు

## కమ్మేసిన పొగమంచు

ఆదిలాబాద్ జిల్లాలో చలికాలం సీజన్ ప్రారంభమైంది. ఉదయం ఆదిలాబాద్, నాగ్‌పూర్ జాతీయ రహదారి-44ను పొగమంచు కమ్మేసింది. ఏడు గంటల వరకు కూడా విపరీతమైన మంచు కారణంగా ఎన్‌హెచ్‌పై వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వాహనాలకు లైట్లు వేసుకుని మెల్లిగా నడిపించారు. పొగమంచుతో జాతీయ రహదారి అటుగా వెళ్లేవారిని కనివిందు చేసింది.

- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, అక్టోబర్ 16



తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేయనున్న బతుకమ్మ చీరెలు

# పండుగ అయిపాయే.. చీరెలు రాకపాయే..

● పంపిణీ కానీ బతుకమ్మ చీరెలు ● 2,02,297 చీరెలకు 88,920 సరఫరా..

ఆదిలాబాద్, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ) : ఆడపడుచులు సంతోషంగా జరుపుకునే బతుకమ్మ పండుగకు చీరెలను పంపిణీ చేస్తున్నామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకోవడంలో విఫలమైంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళలకు ఏటా పండుగకు ముందుగానే బతుకమ్మ చీరెలను పంపిణీ చేసింది. గతేడాది ఆదిలాబాద్ జిల్లాలో 2,63,247 మంది లబ్ధిదారులకు అందజేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆడపడుచులకు అందించిన సాయంతో మహిళలు బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకున్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాదిరి కాంగ్రెస్ ప్రభుత్వం పండుగకు చీరెలను పంపిణీ చేస్తుందని మహిళలు ఆశించినా వారికి నిరాశే మిగిలింది. 2,02,297 చీరెలు అవసరమని అధికారులు గుర్తించారు. దసరా ముందటి రోజు వరకు జిల్లాకు కేవలం 1,13,377 చీరెలను మాత్రమే ప్రభుత్వం సరఫరా చేసింది. ఇంకా 88,920 సరఫరా చేయాల్సి ఉండే. తక్కువ చీరలు పంపిణీ కావడంతో చీరెల పంపిణీ నిలిచిపోయినట్లు తెలుస్తుంది. జిల్లాకు చేరిన చీరెలను మండలాల్లోని ఐకేపీ కార్యాలయాలకు పంపించామని, ప్రభుత్వం ఆదేశాల మేరకు చీరెల పంపిణీ నిలిపివేశామని గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు తెలిపారు.



ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఐకేపీ కార్యాలయంలో బతుకమ్మ చీరెలు

# సీఎం రేవంత్‌పై కేసు నమోదు చేయాలి

## పోలీసులు అధికార పార్టీ జేబులాగా వ్యవహరించొద్దు

● ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ మా ఫిర్యాదును పరిశీలించాలి

● మాజీ మంత్రి జోగు రామన్న



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ) : ఆరు గ్యారెంటీల హామీలతోపాటు రుణమాఫీ విషయంలో రైతులను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై జిల్లా పోలీసులు వెంటనే కేసు నమోదు చేయాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 420 హామీలతో మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని తాము ఈనెల 8న ఆదిలాబాద్ డీఎస్పీకి ఫిర్యాదు చేసినా చర్యలు లేవన్నారు. మూసి ప్రాజెక్టు విషయంలో స్కాం జరిగిందని ఆరోపించిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఉట్నూర్‌లో పోలీసులు కేసు నమోదు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తున్నదని ప్రశ్నించే గొంతుకలను ప్రభుత్వం అణచివేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు వేధింపులు భరించలేక మాజీ ఎంపీపీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు.

### ఆందోళనలకు వెనుకాడం..

రుణమాఫీ విషయంలో రైతులను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై తాను ఇచ్చిన ఫిర్యాదును ఎస్పీ గౌష్ ఆలం పరిశీలించాలని కోరారు. పోలీసులు అధికార పార్టీకి జేబులుగా మారవద్దని సూచించారు. తమ ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉట్నూర్ పోలీసు స్టేషన్‌లో కేటీఆర్‌పై ఎలా కేసు నమోదు చేస్తారని ప్రశ్నించారు. సీఎంపై కేసు నమోదు చేయకపోతే జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, అజయ్, నర్సింగరావు, విజ్జిగిరి నారాయణ, యూనిస్ అక్బానీ, మార్సెట్టి గోవర్ధన్, కుమ్ర రాజు, పరమేశ్వర్, అశోక్, పురుషోత్తం, నవాతే శ్రీనివాస్‌లు ఉన్నారు.

# దళారులకు అమ్మి మోసపోవద్దు

● బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ● నేరడిగొండలో సోయా కొనుగోళ్లు ప్రారంభం

నేరడిగొండ, అక్టోబర్ 16 : రైతులు పండించిన పంటలను దళారులకు అమ్మి మోసపోవద్దని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో సోయా కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రుణమాఫీ కాక, రైతుభరోసా ఇవ్వక రైతులు వ్యాపారుల వద్ద వడ్డీలకు అప్పులు తీసుకుంటున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీల పేరిట గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలకే పరిమితమై జనాల నమ్మకాన్ని వమ్ముచేసిందని అసహనం వ్యక్తం చేశారు. రైతులు పండిన సోయా పంటను నేరుగా కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని సూచించారు. క్వింటాలు సోయా రూ.4892ల ధరతో కొనుగోలు చేస్తారని తెలిపారు. అనంతరం రైతులను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సాబ్లె కిశోర్‌సింగ్, వైస్ చైర్మన్ వెంకటరమణ, కుమారి చైర్మన్ మందుల రమేశ్, మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నానక్‌సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరమణ, నాయకులు గులాబ్‌సింగ్, కరణ్‌సింగ్, వసంత్, నవీన్, మధన్‌సింగ్, ప్రతాప్‌సింగ్ పాల్గొన్నారు.



నేరడిగొండలో సోయా కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్



నిర్మల్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

## గుండేగావ్ వాసులకు పునరావాసం కల్పించాలి

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 16 : గుండేగావ్ గ్రామ ప్రజలకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం, సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూమయ్య మాట్లాడుతూ.. రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు వర్షాకాలంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ జీవనం గడుపుతున్నారని అన్నారు. తక్షణమే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని కోరారు. పల్సికర్ రంగారావు ప్రాజెక్టు ముంపు బాధితులను ఆదుకోవాలని, 470 కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. గుండెగావ్ యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విలాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు భూక్యా రమేశ్, దేవిదాస్, ఎస్‌ఎన్ రెడ్డి, ఉపాలి, మల్కయ్య, రాష్ట్ర పాల్, లక్ష్మణ్ చంద్రకాంత్ పాల్గొన్నారు.

# కొనుగోళ్లకు పకడ్బందీ చర్యలు

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 16 : పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కొనుగోళ్లపై అధికారులు, రైతులు, ట్రేడర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నవంబర్ మొదటి వారంలో కొనుగోళ్లను ప్రారంభించనున్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 1 లక్ష 47 వేల ఎకరాలలో పత్తి సాగు చేయగా సుమారుగా 10 లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. పత్తి కొనుగోళ్ల ప్రారంభానికి ముందే జిన్నింగ్ మిల్లుల్లో అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. సీసీఐ ద్వారా పత్తి పంటకు కనీస మద్దతు ధర రూ. 7521 నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు తాము పండించిన పత్తిని 8 శాతం తేమ మించకుండా నాణ్యత ప్రమాణాలు పాటించి మద్దతు ధర పొందాలన్నారు. జిల్లాలో 7 అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అంతకుముందు మార్కెటింగ్ శాఖ కరపత్రాలను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఎం వేణుగోపాల్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

### పోలింగ్ స్టేషన్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం

ఖానాపూర్ నియోజకవర్గంలోని పెంబి మండలంలో కొత్తగా 3 పోలింగ్ స్టేషన్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. పోలింగ్ స్టేషన్ రేషనలైజేషన్ లో భాగంగా బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పెంబి మండలంలోని రాంనగర్ మండల పరిషత్ పాఠశాల, బూరుగుపల్లి మండల పరిషత్ పాఠశాల, వాస్పల్లి మండల పరిషత్ పాఠశాలలు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, బీజేపీ జిల్లా కార్యదర్శి కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గాజుల రవికుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు సయ్యద్ హైదర్, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.




ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

# సంఘటితంగా ఉద్యమించాలి

**విశ్రాంత కార్మిక శాఖ అధికారి జగదీశ్‌రెడ్డి**

ఎదులాపురం, అక్టోబర్ 16 : కార్మికులు హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉంటూ ప్రభుత్వంపై ఉద్యమించాలని విశ్రాంత కార్మిక శాఖ అధికారి జగదీశ్‌రెడ్డి అన్నారు. కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయాలనే డిమాండ్‌తో బుధవారం దుకాణాల్లో పని చేసే కార్మికులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక మర్వాడి ధర్మశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్, నేతాజీ, వినాయక్, ఎన్టీఆర్ చౌక్, కలెక్టర్ చౌరస్తా మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగింది. ఇక్కడి కార్యాలయంలో అధికారులకు వినతిపత్రాలు అందించారు. ముందుగా కార్మికుల సంక్షేమానికి చేపట్టిన బంద్‌లో వ్యాపారులు స్వచ్ఛందంగా పాల్గొని దుకాణాలను మూసి ఉంచారు. ఈ సందర్భం గా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. అడగనిది ప్రభుత్వాలు ఏమీ ఇవ్వవని, సంక్షేమం, హక్కుల కోసం ప్రశ్నించాలన్నారు. ప్రభుత్వాలు కూడా కార్మికుల సంక్షేమం దిశగా ముందుకు సాగాలన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సంతోష్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు రాజేశ్వర్ పాల్గొన్నారు.